క్లుప్తంగా

పంటల బీమాతో రైతులకు మేలు



రమణయ్యపేటలో బీమా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోతి, సిబ్బంది

ఏలేశ్వరం: పంటల బీమాతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. మండలంలోని రమణయ్య పేట, సి.రాయవరం గ్రామాల్లో గురువారం ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా పథకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల బీమా ద్వారా రైతులకు నష్టం జరగకుండా రక్షణ లభిస్తుందన్నారు. వరి ఎకరానికి రూ.630, మినుములు, పెసలు ఎకరానికి రూ.300 చొప్పున చెల్లించాలన్నారు. బీమా చెల్లింపునకు ఈనెల 30 వరకూ గడువు ఉంద న్నారు. మీసేవా ఆధార్ సెంటర్(సీఎస్‌సీ) ద్వారా చెల్లింపులు చేయవచ్చాన్నారు. అనంతరం బీమా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: స్థానిక శెట్టి బలిజపేటలో ఉన్న సత్తెమ్మ తల్లి 31 జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తోటకూర సత్తెమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వచ్చి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

గోకవరంలో అన్న సంతర్పణ

గోకవరం: స్థానిక వెలమపేట వద్ద గట్టు మీద కనకదుర్గమ్మ ఆలయం వద్ద గురువారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. సొసైటీ మాజీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని ధర్మకర్త పాలంకి సాయి బాబా ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరి నారు మళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



నెల్లిపూడిలో వరి నారు మడులను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: రబీ సీజన్ వరి నారు మళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. గురువారం నెల్లిపూడిలో రైతులతో కలిసి వరి నారుమళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారు మడిలో ఒక ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరు తడిగా నీరు పెట్టాల న్నారు. నారు మడిలో జింక్ లోపం గమనిస్తే జింగ్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నారు మడిలో జీవామృతం వేయడం వలన నారు ఆరోగ్యవంతంగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేయాలి



పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రత్తిపాడు: మరో నాలుగు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేయాలని అధికారులు సూచిస్తున్నారు. జగ్గంపేట వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్, తహసీల్దార్ ఎం .సూర్యప్రభ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి పంట కోతలు నాలుగు రోజుల పాటు వాయిదా వేయాలని సూచించారు. కోసిన పంటను ఎత్తైన ప్రదేశంలో కుప్పలుగా వేసి, బరకాల వంటి వాటితో రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలంటూ వారు రైతులను హెచ్చరించారు. మండలంలో 6,200 ఎకరాల్లో పంటను అధికారుల సూచనలతో కుప్పలుగా వేస్తున్నారు. పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

పింఛన్.. టెన్షన్

- పింఛనుదారుల్లో ఉత్కంఠ
- పైలట్ సర్వేను ప్రారంభించిన ప్రభుత్వం
- జారీకి సిద్ధమైన నోటీసులను హోల్డ్‌లో ఉంచిన సర్కారు



పైలట్ ప్రాజెక్టుగా రేఖవానిపాలెంలో పింఛన్లు తనిఖీ చేస్తున్న అధికారులు

తుని మండలంలో పింఛన్లు పొందుతున్న వివిధ వర్గాలు

పింఛను వివరం	పింఛనుదారుల సంఖ్య
వృద్ధాప్య పింఛన్లు	5909
దివ్యాంగుల పింఛన్లు	1940
ఒంటరి మహిళా పింఛన్లు	288
వితంతువు పింఛన్లు	3255
అభయహస్తం పింఛన్లు	264
డప్పు కళాకారులు	119
చేనేత కార్మికులు	135
ఇతర పింఛన్లు	285
మొత్తం పింఛన్లు	12195

తుని రూరల్: కుటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రమంగా పింఛనుదారుల సంఖ్య తగ్గుతుంది. వీరి సంఖ్యను మరింత కుదించే ఉద్దేశంతో పింఛనుదారుల పునఃపరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. వేర్వేరు మండలాలకు చెందిన గెజిటెట్ అధికారులను నియమించి ఈనెల తొమ్మిదిన 11 ప్రత్యేక బృందాలుగా విభజించి సమగ్ర సర్వే జరిపించింది. సర్వే జరిపిన బృందాలు నివేదికలను ప్రభుత్వానికి అందించాయి. 2812 మంది జనాభా ఉన్న పంచాయతీ పరిధిలో 967 కుటుంబాలు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో రేఖవానిపాలెం, మరువాడ గ్రామాలు ఉన్నాయి. 433 మంది లబ్ధిదారుల ఉండగా ఇంటింటా సర్వేకు 399 మంది హాజరయ్యారు. 34 మంది వివిధ కారణాలతో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడంతో సర్వేకు హాజరుకాలేదు. అనర్హులను గుర్తించేందుకే ఈ సర్వే జరిపినట్టు పేర్కొంటున్నా అసలు లక్ష్యం పింఛనుదారుల సంఖ్యను తగ్గించేందుకేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

దివ్యాంగ పింఛన్లలో కోత

ప్రధానంగా దివ్యాంగుల పింఛన్లలో కోత విధించనున్నట్టు తెలుస్తోంది. 2024 మే నాటికి తుని మండలంలో 13 వేలకుపైగా ఉండే లబ్ధిదారులు ఈ నెలకు 12,195కి పడిపోయింది. పైలెట్ సర్వే ఆధారంగా అన్ని గ్రామాల్లో సర్వే చేసి పింఛన్లు తొలగించే ప్రక్రియను సంకల్పించినట్టు తెలుస్తోంది. ముందుగా నోటీసులు జారీకి అధికారులు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. నోటీసులు జారీ చేస్తారా లేదా అన్నది వారంలో తెలియనుంది.

నోటీసులు జారీ చేయలేదు



రేఖవానిపాలెంలో పైలెట్ ప్రాజెక్టుగా అన్ని రకాల పింఛన్లపై సమగ్ర సర్వే జరిగింది. పింఛన్ల తొలగింపుపై లబ్ధిదారుల ఎవరికీ నోటీసులు జారీ చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంలో భాగంగా తుని మండలంలో అన్ని గ్రామాల పరిధిలో పింఛనుదారులకు జారీ చేయాలని భావించినా నోటీసులను ప్రభుత్వం హోల్డ్‌లో ఉంచింది. ఉన్నత అధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటాం. కొత్త రేషన్ కార్డులు జారీ తర్వాతే కొత్తగా పింఛన్ల మంజూరు ప్రక్రియ జరుగుతుంది.

– కె.సాయి నవీన్, ఎంపీడీఓ, తుని

14 రకాల పింఛన్లు

తుని మండలంలో 23 పంచాయతీల పరిధిలో 27 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 85వేలకుపైగా జనాభా ఉండగా అందులో 12195 మంది 14 రకాల సామాజిక పింఛన్లు తీసుకుంటున్నారు. ఇదే విధంగా తుని పట్టణం, కోటనందూరు, తొండంగి మండలాల్లో జనాభా, పింఛనుదారులు ఉన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా తుని మండలం రేఖవానిపాలెం లో సర్వే చేయడం, వచ్చే నెలలో పింఛన్లు తొలగిస్తారన్న అపోహలతో లబ్ధిదారులు దినదిన గండంగా గడుపుతున్నారు. కుటమి నాయకులకు వ్యతిరేకంగా ఉన్నవారిని గుర్తించి అనర్హులుగా పేర్కొని పింఛన్లు నిలిపివేస్తున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2014–2019 మధ్యలో ఇదేవిధంగా పలువురి పింఛన్లు నిలిపివేసిన సంఘటనలు గుర్తు చేసుకుంటున్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై నేడు శిక్షణ

రౌతులపూడి: మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులకు, ఎంపీటీసీలకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శివరామ కృష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు శిక్షణా తరగతులు

కిర్లంపూడి: ఎంపీటీసీలు, సర్పంచులకు శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ హెచ్ హరికృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ సమావేశంపు హాలులో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఉంటుందన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ చిన్నింపేట గ్రామంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల ఆందోళనలు గురువారం కొనసాగాయి. కార్మికులు ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఫ్యాక్టరీని తెరచి తమకు ఉపాధి కల్పించాలన్నారు. కార్మికులు వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ పనుల్లో కదలిక

- రాకపోకలకు అనువుగా రోడ్ల ఏర్పాటు



వి.కొత్తూరు సమీపంలో పోలవరం కాలువ రెండు వైపులా రాకపోకలకు అనువుగా సిద్ధం చేసిన రహదారి

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఐదో ప్యాకేజీ పనుల్లో కదలిక మొదలైంది. గతంలో షబీర్ డ్యాం, పీఎస్‌కే కంపెనీలకు పనులు అప్పగించగా ప్రభుత్వం ఈసారి మరో కంపెనీకి పనులు అప్పగించినట్టు తెలుస్తోంది. సంక్రాంతి తర్వాత పూర్తిస్థాయిలో పనులు మొదలయ్యే అవకాశం ఉంది. పనులు చేసేందుకు వీలుగా పోలవరం ఎడం ప్రధాన కాలువకు రెండు వైపులా పేరుకుపోయిన మొక్కలను తొలగించి వాహనాల రాకపోకలకు అనువుగా రహదారులను సిద్ధం చేశారు. తుని మండలంలో ఉన్న ఐదో ప్యాకేజీలో 18 కిలోమీటర్ల పొడవునా కాలువ నిర్మించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ప్రధానంగా కుమ్మరిలోవ, తుని మధ్య కట్రాళ్ల కొండ వద్ద తాండవ నదిపై ఆక్విడెక్టు నిర్మించాల్సి ఉంది. ఈ పనుల సైతం 50 శాతం పూర్తయ్యాయి. అదేవిధంగా చేపూరు, తేటగుంట శివారు జాతీయ రహదారి క్రాసింగ్ బ్రిడ్జిలు, చేపూరు-మర్లపాడు, తేటగుంట-టి.తిమ్మాపురం, తేటగుంట-గవరపేట ప్రధాన రహదారుల్లో వంతెనలు, సాగునీటి కాలువపై కల్వర్టులు కూడా నిర్మించాలి. ఈసారైనా పనులు పూర్తవుతాయో లేదోనని రైతులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చెరకు కాటాలు



పాతకొట్టాంలో నిరుపయోగంగా ఉన్న చెరకు కాటా

కోటనందూరు: మండలంలో చెరకు కాటాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో మొత్తం 12 కాటాలు(చెరకు సేకరణ కేంద్రాలు) ఉండగా ఒక్క కోటనందూరు మండలంలోనే ఆరు కాటాలున్నాయి. గత దశాబ్ద కాలంగా ఫ్యాక్టరీ మూత పడడంతో కాటాల పరిధిలో చెరకు సాగు కనుమరుగైంది. దీంతో మండలంలోని ఎస్సార్‌పేట, బొద్దవరం , కోటనందూరు, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, అల్లిపూడి గ్రామాల్లో ఉన్న చెరకు కాటాలు కూడా మూతపడ్డాయి. కాటాల వద్ద రైతుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్డులు కూర్చునేందుకు సౌకర్యవంతంగా ఉండడం, జనావాసాలకు దూరంగా గ్రామ పొలిమేర్లలో ఉండడంతో ఇక్కడ మందు, గంజాయిబాబులు తిష్ట వేసి హల్‌చల్ చేస్తున్నారు. కాటాల వద్ద రాత్రి వేళల్లో పరిస్థితి అధ్వానంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. మరో పక్క భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ కాటాలు అన్యాక్రాంతమైపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికార యంత్రాంగం కాటాలను పట్టించుకోకపోతే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు కాటాలను పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. తాటిపర్తి ఎన్టీఆర్ కాలనీకి చెందిన రౌతు నరసయ్య(33) మద్యానికి బానిసై నిత్యం తాగుతున్నాడు. తన భార్య తాగవద్దని వారించడంతో మనస్తాపానికి చెంది తనకు తానుగా చనిపోవాలనే ఉద్దేశంతో తను కౌలు చేస్తున్న వ్యవసాయ పొలంలో పురుగుల మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అది చూసిన అతని చిన్నాన్న రామకృష్ణ వెంటనే ఆటోలో ప్రత్తిపాడు గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- సదస్సుల్లో అర్జీలు స్వీకరించిన అధికారులు



మల్లవరం రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. మల్లవరం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజల వద్ద నుంచి 11 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీ సాయిప్రసాద్, వీఆర్వో కోన శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గండేపల్లి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తెలియజేశారు. బొర్రంపాలెంలో గురువారం జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సును ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా తెలియపరిచి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం రిజిష్టర్లు పరిశీలించిన ఈ కార్యక్రమంలో పది అర్జీలు అందినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 15 అర్జీలు

కిర్లంపూడి: మండలంలోని వీరవరం, రామకృష్ణాపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 15 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ జె.చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రీసర్వే ఉప తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి పరిశీలించారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ ఉన్నారు.



శరభవరంలో గ్రామ సమస్యలపై ఆరా తీస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ కలెక్టర్ ఏ శ్రీనివాసరావు అన్నారు. శరభవరంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచి అధికారులు ఆరు ఫిర్యాదులను స్వీకరించారు కార్యక్రమంలో తహశీల్ధార్ ఎం సూర్యప్రభ, ఎఆర్ఐ గోపాలకృష్ణ, సర్పంచ్ అమరాధి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడిలో 73 దరఖాస్తులు

రౌతులపూడి: మండలంలోని రాజవరం, రామకృష్ణాపురం, ఎం.కొత్తూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 73 దరఖాస్తులందాయని డిప్యూటీ తహసీల్దారు నరేష్ తెలిపారు.



వీరవరంలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

పట్టాదారు పాసుపుస్తకాలు, కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, మ్యుటేషన్లు తదితర వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అందాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్ఓ, విలేజ్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

తొండంగి: గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం ఎ.కొత్తపల్లిలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. ఈ సదస్సుకు 36 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దార్ మురార్జీ, ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అభ్యంతరకరం

గోకవరం: పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. పార్లమెంటులో అంబేడ్కర్, అంబేడ్కర్ అని జపం చేసే బదులు దేవుడిని జపిస్తే పుణ్యం వస్తుంది, ఏడు జన్మల పుణ్యం దక్కుతుంది అని అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను యావత్ దేశమంతా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రాత్మకమైన తప్పుకు వెంటనే క్షమాపణ చెప్పి హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగ్గంపేట: పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఎగతాళి చేసి మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని బహుజన సమాజ్‌వాది పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి జుత్తుగ నాగేశ్వరావు అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా జగ్గంపేటలో ఆందోళన చేపట్టారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు, అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్త చేశారు. జై భీమ్ నేతలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలు దేశంలో విద్వేషాలకు కారణమవుతుందని అన్నారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని వెంటనే ఆ మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఐలాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు అవసరాల దేవి, పిల్లా రాజు పాల్గొన్నారు.

అల్పపీడనం.. అన్నదాతల్లో కలవరం

- వాతావరణంలో మార్పులు
- అడపాదడపా చినుకులు
- నగానికి పైగా విస్తీర్ణంలో పూర్తికాని పంట కోత
- పంట ఒబ్బిడిలో నిమగ్నం
- ఆందోళన చెందుతున్న రైతులు



తొండంగి మండలంలో రోడ్లపై ఖరీఫ్ వరి పంటను నూర్పిడి చేస్తున్న రైతులు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఖరీఫ్ రైతులు కలవరపడుతున్నారు. తరచూ అల్పపీడనాలు, వాయుగుండాలతో ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పు కారణంగా అడపా దడపా చినుకులు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంట ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని పంపా, పీబీసీ, చెరువులు, వ్యవసాయ బోర్ల పరిధిలో 16వేల ఎకరాల్లో వరిసాగు జరిగింది. బోర్లు పరిధిలో ఇప్పటికే పంట కోత పూర్తికావడంతో రబీ వరినాట్లు పనులు జరుగుతున్నాయి. పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో తొలకరి సాగునీటి లభ్యత సక్రమంగా అందకపోవడంతో వరినాట్లు కూడా ఆలస్యంగా వేశారు. ఈనేపథ్యంలో అనంతరం కుండపోత వర్షాలకు పంట ముంపుబారిన పడడం అనంతరం వచ్చిన తెగుళ్ల నుంచి తేరుకుని పంటను ఎలాగోలా బతికించుకున్న తరుణంలో కొద్ది రోజుల క్రితం ఫెంగల్ తుపాను ప్రభావానికి స్వల్పంగా నష్టం వాటిల్లింది. అది కాస్తా తొలగిందని అనుకున్న సమయంలో మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా మాగుడు వాతావరణంతో మోస్తారుగా వర్షాలు కురిశాయి. పంపా, పీబీసీ పరిధి ప్రాంతాలైన ఎ.కొత్తపల్లి,, కోదాడ, తొండంగి, శృంగవృక్షం, పి.అగ్రహారం , పైడికొండ, వేమవరం, దానవాయిపేట, శృంగవృక్షంపేట తదితర ప్రాంతాల్లో ఇంకా పంటలన్నీ కోత దశలో ఉన్నాయి. ఇప్పటికే సుమారుగా 40శాతం మాత్రమే పంట కోత పనుల పూర్తయ్యాయి. మరో 60 శాతం పంట కోత కోయాల్సి ఉంది. ఈనేపథ్యంలో ప్రతికూల వాతావరణంతో పంట ఒబ్బిడి కోసం రైతన్నలు ఆపసోపాలు పడుతున్నారు. వరికోత యంత్రాలతో ఆదరా బాదరాగా పంటలను కోత కోయించి ఒబ్బిడి చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

తీరంలో ఎగసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో దానవాయిపేట, అద్దరిపేట, కొత్తచోడిపల్లిపేట సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తిన ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు ప్రతికూల వాతావరణంలో వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



గవరపేటలో నూర్పిళ్లపై రైతులకు సూచనలిస్తున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా పడుతున్న కొద్దిపాటి జల్లులు, ఈదురు గాలులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఈ సంవత్సరం 2900 హెక్టార్లలో వరిసాగు చేయగా ఇప్పటి వరకు 750 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. ఇందులో 560 హెక్టార్లలో పంటను రైతులు ఒబ్బిడి చేయగా మరో 190 హెక్టార్లలో పంట పనులపై ఉందని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ తెలిపారు. రెండువేల హెక్టార్లకుపైగా పంట కోతలు జరగాలన్నారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ రైతుల పంటకోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ ప్రభావం నష్టం లేదని, భారీ వర్షాలు కురిస్తే నష్టం వాటిల్లేప్రమాదం ఉందన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఎపీఓ	– 70939 98217
ఎపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778